ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 35.0
కనిష్ఠం 24.0
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
శుక్రవారం 18 జూలై 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	560.70 (234.0796)	65,522	1800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.34 (3.53)	-	139.84
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	153.017 (18.2313)	-	5,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.128 | డ్రెస్ : రూ.191 | స్కిన్‌లెస్ : రూ.215



మూసీ కాల్వలకు నేడు నీటి విడుదల

మూసీ ఆయకట్టులో వానాకాలం సాగు కోసం నేడు కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేయనున్నారు. నార్లుపోసి, దుక్కులు దున్ని ఒడ్డు, వరం పెట్టి నీటి కోసం ఎదురుచూస్తున్న ఆయకట్టు రైతులు మురిసిపోనున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల బోరుబావుల కింద వరినాట్లు వేశారు. వర్షాలు పడతాయని ఎదురుచూస్తున్న రైతాంగం ఆశలు ఆవిరయ్యే పరిస్థితి దాపురించిన తరుణంలో మూసీ ప్రాజెక్టు ఆదుకోనుంది.

(ఆంధ్రజ్యోతి-భానుపురి)

మూసీ ఆయకట్టు కింద ఉన్న మూడు నియోజకవర్గాల్లో సాగునీటి సమస్య తీరనుంది. ఈ వానాకాలం సీజన్‌లో 30వేల ఎకరాలకు నాలుగు విడతల్లో నీటి విడుదల చేయనున్నారు. ఆరుతడి పంటలైన మినుములు, పొద్దుతిరుగుడు, వేరుశనగ లాంటి పంటలకే వాడాలని నిబంధన ఉన్నా కొన్నేళ్లుగా అంతటా వరి సాగుకే వినియోగిస్తున్నారు. ఇదిలా ఉండగా కుడికాల్వ ఆధునికీకరణ పనులు 90శాతం పూర్తికాగా, ఎడమకాల్వ వైపు 70శాతం మాత్రమే పూర్తయ్యాయి. పిల్ల కాల్వలు సైతం సక్రమంగా లేవు. ఆయకట్టు చివరి భూములకు చేరడం కష్టమేనని రైతులు చెబుతున్నారు.

నీటి విడుదల ప్రణాళిక ఇలా..

మొదటి విడత : జూలై 18 నుంచి ఆగస్టు 12 వరకు 25 రోజులు
రెండో విడత : ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 11 వరకు 15 రోజులు
మూడవ విడత: సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 11 వరకు 15 రోజులు
నాల్గొవ విడత : అక్టోబరు 26 నుంచి నీటి సామర్థ్యం ఉన్నంత వరకు...
(మొదటి రోజు 150 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తారు)

ముందస్తు నోటీసులు

కాల్వల నుంచి నీటి మోటార్ల ద్వారా తరలించకుండా అధికారులు ముందస్తు నోటీసులు జారీ చేశారు. సుమారు 1000 మోటార్లు కలిసిన రైతులకు నోటీసులు ఇవ్వడంతో పాటు ఇలాంటి మోటార్లు నడిపించే వారికి మీటర్లు ఇవ్వవద్దని, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయవద్దని విద్యుత్ శాఖ అధికారులకు రాతపూర్వకంగా తెలిపారు. అదేవిధంగా నీటి నిర్వహణ కోసం డిస్ట్రిబ్యూటరీల వారీగా ఐదుగురితో కమిటీని ఏర్పాటు చేయించారు. వీరు నీటితగాదాలు రాకుండా చూసుకుంటారని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

ఆయకట్టు చివరి వరకు నీటిని అందిస్తాం

మూసీ ఆయకట్టు చివరి భూములకు నీటిని చేర్చడమే లక్ష్యం. మోటార్లను తొలగించాలని నోటీసులు ఇచ్చాం. విద్యుత్ శాఖ అధికారులకు సైతం రాతపూర్వకంగా తెలిపాం. తడుల వారీగా నీటిని వదులుతాం.

చంద్రశేఖర్, డీఈ మూసీ ప్రాజెక్టు, సూర్యాపేట

● గరిడేపల్లిలో 6 సెంటీమీటర్ల వర్షం



మఠంపల్లి మండల కేంద్రంలో వర్షానికి వీధుల్లో నిలిచిన నీరు

నేరేడుచర్ల/మఠంపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షం సంతోషాన్ని ఇచ్చింది. నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి, మఠంపల్లి మండలాల్లో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా గరిడేపల్లిలో 6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇప్పటికే బోర్లు, బావుల కింద వరి సాగుకు సిద్ధమైన రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ వర్షం రైతుల ఆశలకు ప్రాణం పోసినట్లయ్యింది. పొలాల గట్ల మీద నుంచి వర్షపు నీరు ప్రవహించింది. పత్తి, మిరప, కంది రైతులకు ఊరట కలిగింది.

విద్య, వైద్య శాఖల్లో మెరుగులు



- గణనీయ మార్పు తెస్తున్న కలెక్టర్ తనిఖీలు
- విద్యార్థులు, రోగులతో మమేకం
- సమస్యలపై ఆరా, పరిష్కారాలకు ఆదేశాలు

జిల్లాలో విద్య, వైద్యరంగాలపై కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ దృష్టి సారించారు. విస్తృతంగా తనిఖీలు చేస్తూ పనితీరులో మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటివరకు 80 పాఠశాలలను, చాలా ఆసుపత్రులను సందర్శించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారిలో ఉత్సాహాన్ని నింపుతున్నారు. అదేవిధంగా ఆసుపత్రుల నిర్వహణలో ఇబ్బందులు, సిబ్బంది పనితీరు, ఔషధాల నిల్వలు పరిశీలిస్తున్నారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్నారు. దీంతో ఆయాశాఖల్లో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలంటే గతంలో చిన్నచూపు ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితిలో మార్పు వస్తోంది. కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ పర్యటన, తనిఖీలు, సమీక్షలు విద్యాశాఖలో చాలామార్పులు తీసుకువచ్చాయి. విద్యార్థులపై ఉపాధ్యాయుల శ్రద్ధ, పెరిగిన మౌలిక వసతుల కల్పనతో పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగింది. ఇటీవల తిరుమలగిరి మండలం తొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో కొత్తగా అడ్మిషన్లు తీసుకోలేమని ఏకంగా బోర్డు పెట్టారు. సంక్షేమ హాస్టళ్లల్లో విద్యార్థుల నమోదు పెరిగింది.

విద్యార్థులతో మమేకమవుతూ

కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ పాఠశాలలను తనిఖీ చేయడంతో పాటు విద్యార్థులకు పాఠాలు కూడా చెబుతున్నారు. ప్రతి రోజూ ఐదు ఇంగ్లీష్ పదాలను తెలుగులోకి, తెలుగు నుంచి ఇంగ్లీష్‌లోకి అనువదించి మాట్లాడాలని చెబుతున్నారు.ఏరోజు ఏ పదాలు నేర్పాలో ఉపాధ్యాయులకు టైం టేబుల్ ఇచ్చారు. ఈ విధానంతో విద్యార్థులు ఇంగ్లీష్‌లో మెరుగయ్యారు. అన్నిపాఠశాలల్లో ఫ్యాన్లు, లైట్లు, తాగు నీటి కోసం ఆర్వోప్లాంట్స్ ఏర్పాటుచేయించారు. మధ్యాహ్న భోజన మెనూ బోర్డులను పాఠశాలల్లో ఏర్పాటు చేయించి అమలును ఆయన పరిశీలిస్తున్నారు. బాలికలు ఉన్న పాఠశాలల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించారు. మన ఊరు-మనబడి కింద నిధులతో పాటు జిల్లా మినరల్ ఫండ్ ట్రస్టు నిధుల నుంచి

(మిగతా 8వ పేజీలో)

ఆసుపత్రుల వ్యర్థాలతో అనర్థాలు



- బహిరంగ ప్రదేశాల్లో ఆసుపత్రి వ్యర్థాలు
- ప్రజారోగ్యానికి ప్రమాదం
- అయినా పట్టని పొల్యూషన్ బోర్డు
- ఉమ్మడి జిల్లాలో 741 ఆసుపత్రులకు 302ల్లో మాత్రమే నిబంధనలు అమలు

ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వ్యర్థాలు ప్రజారోగ్యాలను దెబ్బతీసేలా ఉన్నాయి. చికిత్సల్లో వినియోగించే బయోమెడికల్ వస్తువులను నిబంధనల మేరకు నిర్వీర్యం చేయాల్సి ఉంది. అయితే ఇష్టానుసారం వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేస్తున్నారు. వీటితో అనేక ప్రాణాంతకమైన వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. అయినప్పటికీ నియంత్రించాల్సిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు పట్టించుకోవడం లేదు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)

ఆసుపత్రుల్లో చికిత్సలకు ఉపయోగించిన వస్తువులు, ఇతరవ్యర్థాలను ప్రజాసంచారానికి దూరంగా ఒక కంపెనీలో నిర్వీర్యం చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం ఒక ప్రైవేట్ఏజెన్సీకి అప్పగించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో పొల్యూషన్



ఆసుపత్రుల్లో వ్యర్థాలను వేసేందుకు ఉపయోగించాల్సిన డస్ట్‌బిన్లు

కంట్రోల్ బోర్డు వద్ద 741 ప్రైవేట్ ఆస్పత్రులు నమోదు కాగా 302ఆస్పత్రులు మాత్రమే వ్యర్థాలను ఏజెన్సీకి అప్పగిస్తున్నాయి. మిగతా వారు వ్యర్థాలను బయటపడవేస్తున్నారు. 100మంది ఓపీ పేషంట్లు వచ్చే ఆస్పత్రులు కూడా వ్యర్థాలను ఏజెన్సీకి అప్పగించడంలేదు. పలు సందర్భాల్లో బయటపడేసిన వ్యర్థాలను మునిసిపాలిటీ, చెత్త ఏరుకునే వారు తీసుకెళ్తున్నారు.

గంటల్లోనే నిర్వీర్యం చేయాలి

ఆసుపత్రుల్లో పలు ప్రమాదకరమైన వ్యాధులు, ఆపరేషన్లకు ఉపయోగించిన బయోమెడికల్ వ్యర్థాలను బయటవేయడంతో అక్కడి వాతావరణం కలుషితమయ్యే అవకాశముంది. దీంతో గుర్తించలేని వ్యాధులు వ్యాపించే అవకాశాలు లేకపోలేదు. ముఖ్యంగా సిరంజిలు, నీడిల్స్, గ్లూకోజ్ బాటిల్స్ రక్తం, మాయ, కాటన్, శరీర అవయవాలు ఆస్పత్రుల వ్యర్థాలుగా ఉంటాయి. ఈ వ్యర్థాలను 48 గంటల కంటే ఎక్కువ సమయం ఉంచరాదు. ఆ లోపే ఏజెన్సీ సేకరించి వాటిని నిర్వీర్యం చేయాల్సి ఉంటుంది.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ అమలు కాక..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వ్యర్థాల నిర్వీర్యం సక్రమంగా జరగడంలేదు. ఏజెన్సీకి ఉమ్మడి జిల్లాలోని 12ఆస్పత్రుల వ్యర్థాలు మాత్రమే అందిస్తున్నారు. అందులో నల్లగొండ, సూర్యాపేట, మిర్యాలగూడ, భువనగిరి, కోదాడ, హుజూర్‌నగర్, రామన్నపేట, దేవరకొండ, చౌటుప్పల్, నకిరేకల్, నాగార్జునసాగర్, ఆలేరు ఆస్పత్రులు ఉన్నాయి. మిగతా ఆస్పత్రుల నుంచి ఆసుపత్రి వ్యర్థాలను బయట పడవేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా అంతటికీ ఒకే ఏజెన్సీ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వ్యర్థాలను నిర్వీర్యం చేసే బాధ్యతను ఓ ప్రైవేట్ ఏజెన్సీకి ప్రభుత్వం అప్పగించింది. సేకరించిన వ్యర్థాలను భువనగిరి సమీపంలోని కంపెనీలో నిర్వీర్యం చేస్తున్నారు. ఇందుకు గాను 20పడకల ఆస్పత్రి అయితే నెలకు రూ.3వేలు, 30 పడకల ఆస్పత్రికి రూ. 4500, 50 పడకల ఆస్పత్రికి రూ.7500, 100 పడకల ఆస్పత్రికి నెలకు రూ.15వేలు చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా వ్యర్థాలను నిల్వచేసేందుకు ఏజెన్సీ వారు ప్రత్యేక కవర్లను అందిస్తారు. వాటికి పరిమాణాన్ని బట్టి సంబంధిత ఆస్పత్రి యాజమాన్యాలే డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది.

పట్టించుకోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు

ఆస్పత్రుల వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా నియంత్రించాల్సిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు వారికి పట్టనట్లుగా

(మిగతా 8వ పేజీలో)



48



బూరుగడ్డలో యూరియా కోసం పీఏసీఎస్ కార్యాలయంలో గుమిగూడిన రైతులు

యూరియా కోసం బారులు

● తెల్లవారుజామునే బూరుగడ్డకు చేరుకున్నరైతులు

హుజూర్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్ మండలంలో యూరియా కొరత రైతులను నిరాశకు గురిచేస్తోంది. బూరుగడ్డ సహకార పరపతి సంఘం ఎదుట గురువారం యూరియా కోసం రైతులు తరలివచ్చారు. బుధవారం సంఘానికి 444బస్తాల యూరియా రాగా గురువారం తెల్లవారుజాము నుండే యూరియా కోసం రైతులు బారులు తీరారు. బస్తా రూ.266లకు విక్రయించారు. బూరుగడ్డ రెవెన్యూ క్లస్టర్ పరిధిలో సుమారు 5వేల ఎకరాలు ఉండగా ఎకరానికి 2 బస్తాల చొప్పున యూరియా అవసరం కాగా కనీసం బస్తా కూడా సరఫరా కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పీఏసీఎస్ పరిధిలో రైతులు యూరియా కోసం తీవ్రఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నిలబడితే కొందరికే యూరియా దక్కిందన్నారు. అందని రైతులు నిరాశతో వెనుదిరిగారు. ఇదిలాఉండగా హుజూర్‌నగర్ డివిజన్‌లో సుమారు 260 ఎరువుల దుకాణాలు ఉండగా రూ.400ల నుంచి 500ల వరకు యూరియా బస్తా విక్రయిస్తున్నారు. దీంతో రైతులు సహకార సంఘాల వైపే మొగ్గు చూపుతున్నారు. హుజూర్‌నగర్ మండలంలో వేపలసింగారం, అమవరం, లింగగిరి, హుజూర్‌నగర్, బూరుగడ్డ ప్రాంతాలలో నాలుగు చోట్ల సహకార సంఘాలు ఉండగా వాటిల్లో మాత్రమే తక్కువ ధరకు యూరియా అందిస్తున్నారన్నారు. ఈ క్రమంలో అక్కడ అందకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా యూరి యా అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలు ఇస్తున్నప్పటికీ ఆచరణలో అమలుకావడం లేదు. వారానికి ఒకసారి మాత్రమే సహకార సంఘాలకు లారీ లోడు వస్తుందని అధికారులు తెఎలిపారు.

పాఠాలు అర్థమవుతున్నాయా?

● విద్యార్థులతో కలెక్టర్



మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

కోదాడ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఏమైనా సమస్యలు ఉన్నాయా, ఎలా చదువుతున్నారని కోదాడలోని మైనార్టీ గురుకుల రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులను కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అడిగారు. గురువారం కళాశాలకు వచ్చిన ఆయన ఎంపీసీ ద్వితీయ సంవత్సర విద్యార్థులతో ఆయన మాట్లాడారు. కళాశాలలో భోజనం సరిగా ఉంటుందా, పాఠాలు అర్థమవుతున్నాయా అని ప్రశ్నించారు. విద్యపై ప్రేరణ, ఆసక్తి కలిగేలా ఉద్బోదించారు. కళాశాల పరిసరాలతో పాటు వండిన అన్నం, కూరలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో గ్రూప్ ఫొటో దిగారు. అనంతరం కోదాడ మునిసిపల్ కార్యాలయాన్ని తరలించే ఎంఎస్ఆర్ స్కూల్ భవనాన్ని పరిశీలించి, సూచనలు చేశారు. అనంతరం వివిధ అభివృద్ధి నిర్మాణాలను పరిశీలించి నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సూర్యనారాయణ, మునిసిపల్ కమిషనర్ రమాదేవి పాల్గొన్నారు.

భూభారతి అర్జీలను పరిశీలించాలి

కోదాడ రూరల్: భూభారతి, రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను తప్పిదాలకు తావులేకుండా పరిష్కరించాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. గురువారం కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమైన ఆయన భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిశీలించారు. ప్రతీ దరఖాస్తును భూభారతిలో తప్పక నమోదు చేయాలన్నారు. అర్జీల్లో తాము పరిశీలించినవి, నోటీసులిచ్చిన వివరాలను స్థానిక అధికారులు వివరించారు. సమావేశంలో ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ వాజీద్‌అలీ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీ

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ తనిఖీచేశారు. రోగులతో మాట్లాడారు.గైనకాలజిస్ట్ పద్మావతి గైర్హాజరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన వెంట ఆర్డీవో సూర్యనారాయణ,తహసీల్దార్ వాజీద్‌అలీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతీ ఇంట్లో ఇంకుడుగుంతలు ఉండాలి

నూతనకల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఇంటిలో ఇంకుడు గుంతలు తీసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. గురువారం మండలంలోని ఎడవెల్లి ఆవాసం గుండ్లసింగారం గ్రామంలో ప్రతీ ఇంట్లో తీస్తున్న ఇంకుడు గుంతలను, పంచాయతీ బోర్ వెల్ వద్ద వర్షపు నీరు భూగర్భంలోకి వెళ్లేందుకు చేపట్టిన పనులను ఆయన పరిశీలించి, మాట్లాడారు. వర్షపు నీరు వృథాగా పోకుండా భూగర్భజలాలను పెంచడానికి ఇంకుడుగుంతలు చేపట్టాలని ఆయన ప్రజలను కోరారు. ప్రతీ గ్రామంలో ఇంకుడు గుంతలు తీసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సునీత, ఎంపీవో శశికళ, గ్రామ కార్యదర్శి చలమయ్య ఉన్నారు.



బోర్‌మోటార్ వద్ద ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న రాంబాబు

వంద రోజుల పనులు జరుగుతున్నాయా?



తాళ్లసింగారంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కేంద్ర మానిటరింగ్ కమిటీ సభ్యులు

నూతనకల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కూలి ఎంత వస్తుంది, వంద రోజులు పని కల్పిస్తున్నారా అని కేంద్ర ఉపాధి పనుల మానిటరింగ్ కమిటీ సభ్యులు ఉపాధి కూలీలను ప్రశ్నించారు. గురువారం నూతనకల్ మండలంలోని తాళ్లసింగారం గ్రామంలో ఉపాధి పనులను తనిఖీ చేయడంతో కూలీలతో ముచ్చటించారు. 2020 నుంచి 2025 వరకు చేపట్టిన పనుల వివరాలను అధికారులు, కూలీలను అడిగి తెలుసుకున్నారు. కమిటీ సభ్యులు సలీంకుమార్, సలేమూన్ కూలీలతో ముచ్చటించారు. ఏఏ పనులు చేస్తున్నారని, ఎంత వస్తుందని ప్రశ్నించారు. పని తగ్గట్టుగా కూలి ఇస్తున్నారని కూలీలు సమాధానమిచ్చారు. పింఛన్‌దారులకు పింఛన్ నెలనెలా వస్తుందా అని ఆరా తీశారు. ఏఏ పనులు చేపడుతున్నారని అధికారులను అడిగారు. అనంతరం నర్సరీ కేంద్రాన్ని, పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలో పీఎంస్కీమ్ కిందట మంజూరైన కారం, పిండి గిర్నీ దుకాణాన్ని వారు పరిశీలించారు. కమిటీ వెంట ఎంపీడీవో సునీత, ఎంపీవో శశికళ, ఏపీవో శ్రీరాములు, ఏపీఎం రమణాకర్, గ్రామకార్యదర్శి సుధాకర్ ఉన్నారు.

సాగర్ స్పిల్‌వే శాశ్వత మరమ్మతులకు చర్యలు

● కదిలే క్రేన్ల ఏర్పాటు: ఓఅండ్ఎం ఈఎన్‌సీ

6

జగదీష్‌రెడ్డి శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలి: బీసీ సంఘాలు

సూర్యాపేట టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో జగదీష్‌రెడ్డి శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలని బీసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఫోన్‌ట్యాపింగ్‌కు నిరసనగా గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీసీ సంఘాల నాయకులు జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఎస్పీ తరుపున జానయ్యయాదవ్ పోటీచేసిన సమయంలో జగదీష్‌రెడ్డి తాను ఓడిపోతాననే భయంతో అక్రమకేసులు బనాయించడమే కాకుండా ఆయన ఫోన్లు, కార్యకర్తల ఫోన్లు ట్యాపింగ్ చేయించారని ఆరోపించారు. బీసీలంతా ఏకమై జగదీష్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేలా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు అన్నెపర్తి రాజేష్, భారీ అశోక్, వల్లాల సైదులు, కుంభం వెంకన్న, బొల్లె సైదులు, మీర్‌అక్బర్, ఆవుల అంజయ్య, మల్లయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.



జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీసీ సంఘ నాయకులు

వెల్ఫేర్ పాఠశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం

మేళ్లచెర్వు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థుల సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని గిరిజన సంక్షేమ సొసైటీ కార్యదర్శి సీతామహాలక్ష్మి అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు బుధవారం ఆందోళన చేసిన నేపథ్యంలో మండలకేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌ను గురువారం ఆమె పరిశీలించారు. వసతులను పరిశీలించి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భవన యజమాని అహ్మద్‌ను పిలిపించి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. నీటిసమస్య పరిష్కారం కోసం పైపులైన్ నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్ మురళిని సస్పెండ్ చేసి వైస్‌ప్రిన్సిపాల్ మధుకర్‌కు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించారు. విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో నల్లగొండ రీజినల్ సమన్వయకర్త బలరాంనాయక్, వైస్‌ప్రిన్సిపాల్ మురళీధర్, విజిలెన్స్ ఆఫీసర్ నటరాజ్, రవికుమార్, కాంతరాజు, అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న సీతామహాలక్ష్మి, అధికారులు

స్పిల్‌వే శాశ్వత మరమ్మతులకు చర్యలు

● ఓఅండ్‌ఎం ఈఎన్‌సీ శ్రీనివాస్



సాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేను పరిశీలిస్తున్న ఓఅండ్‌ఎం ఈఎన్‌సీ శ్రీనివాస్, అధికారులు

నాగార్జునసాగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేకు శాశ్వత మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని ఓఅండ్‌ఎం(ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్) ఈఎన్‌సీ శ్రీనివాస్ తెలిపారు. సాగర్ ప్రాజెక్టు పరిశీలన భాగంగా గురువారం ఆయన సాగర్ ప్రధాన డ్యామ్, గ్యాలరీలు, క్రస్ట్ గేట్లు స్పిల్‌వే, ఎడమ కాల్వ, ఎర్త్ డ్యామ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ శ్రీనివాస్ మాట్లాడుతూ సాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేకు శాశ్వత మరమ్మతుల కోసం ఇప్పటికే పలు కంపెనీలతో కలిసి పరిశీలించి చర్చించామని, ఏ ఒక్క కంపెనీ కూడా మరమ్మతులకు ముందుకు రాలేదన్నారు. ఇకపై ప్రతి ఏటా స్పిల్‌వేపై పడిన గుంతలను వెంటనే పూడ్చివేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఏడాది మరమ్మతులు చేపట్టడానికి స్పిల్‌వే వద్ద అటు ఇటు కదిలే క్రేన్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం గ్యాలరీలను పరిశీలించి గ్యాలరీలోని ప్లోరస్ హోల్స్‌లో (ఊటనీరు బయటకు వచ్చే మార్గం) పేరుకుపోయిన కాల్షియంను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రాజెక్టు నిర్వహణలో సమస్యలుంటే పరిష్కరిస్తాం

క్రస్ట్ గేట్లు ఎత్తడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ప్రాజెక్టు ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నిర్వహణలో ఏ చిన్న సమస్య ఉన్న వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏ సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం విజయవిహార్ అతిథి గృహంలో ప్రాజెక్టు ఇంజనీర్లతో కలిసి సమీక్ష ఏర్పాటుచేశారు. ఈ సమీక్షలో నెల్లికల్లు ఎత్తిపోతల పథకం పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిడమనూరు మండలం తుంగపాడు వద్ద నిర్మిస్తున్న చెక్ డ్యాం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎడమ కాల్వ ఆధునికీకరణ పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్, ఇంచార్జీ ఎస్ఈ మల్లికార్జున్‌రావు, ఈఈలు వెంకటయ్య, కరుణాకర్ పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మోత్కూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపల్ కేంద్రంలో ఇందిరానగర్ కాలనీకి చెందిన మున్నా(22) గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మున్నా గతంలో ఒక అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకోగా, ఆమె ఆత్మహత్య చేసుకోవడంతో అతనిపై వేధింపుల కేసు నమోదు అయ్యిందని, ఆ కేసులో అతను జైలుకు వెళ్లి ఇటీవలే బెయిల్‌పై వచ్చాడని ఎస్‌ఐ తెలిపారు. అప్పటి నుంచి మనస్తాపంతో బాధపడుతూనే ఉన్నాడని, దీంతో గురువారం అద్దె ఇంట్లోని స్నానాల గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ తెలిపారు. మున్నా తండ్రి మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిమిత్తం రామన్నపేట ఆస్పత్రికి తరలించి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహామండలి సభ్యుడిగా నర్సింహ

దేవరకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యుడిగా నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పద్మట్‌పల్లి గ్రామానికి చెందిన పల్లె నర్సింహ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నర్సింహ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసకావొద్దని తన పాటల ద్వారా చైతన్య పరుస్తున్నారు.

ఆకట్టుకున్న 'స్వేచ్ఛ, సంధ్యా వెలుగులు'





స్వేచ్ఛ నాటికలోని సన్నివేశాలు

నల్లగొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు గురువారం రాత్రి ముగిశాయి. మూడవ రోజు కార్యక్రమాలను భారత ప్రభుత్వ సాంస్కృతిక విభాగం సభ్యుడు మారం రాజురామచంద్రరావు, సాహితీ వేత్తలు డాక్టర్ పురుషోత్తమాచార్యులు, పెరమాళ్ల ఆనందర్, ఎంవీఆర్ విద్యాసంస్థల చైర్మన్ కొలనుపాక రవికుమార్ ప్రారంభించారు. హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీఎం. రెడ్డి దర్శకత్వంలో రూపొందించిన స్వేచ్ఛ నాటిక, మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం ఆధ్వర్యంలో తడకమళ్ళ రామచంద్రరావు దర్శకత్వంలో రూపొందించిన సంధ్యా వెలుగు నాటికలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోమలికళాసమితి అధ్యక్షుడు బక్క పిచ్చయ్య, గౌరవాధ్యక్షుడు రఘుపతి, ప్రధాన కార్యదర్శి ఎంఎల్. నర్సింహారావు, ఉపాధ్యక్షుడు జీఎల్. కుమార్, వి. భాస్కర్, హర్షిత్ పాల్గొన్నారు.



కళాకారులకు జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు

CLASSIFIEDS

డాక్యుమెంట్ పోయినది

★ అజీమ్ సుల్తానా భర్త సుజావుద్దీన్ అమ్మద్ అను నేను పని నిమిత్తం సూర్యాపేటకు వచ్చాను. సూర్యాపేట కుడకుడ ఏరియాలో డాక్యుమెంట్ నెం. 2970/11989, 6455/1983 నెంబర్స్ గల ఖాళీ స్థలం డాక్యుమెంట్ పోయినది. దొరికిన వారు సంప్రతి సెల్ : 9059411061 నెంబర్‌కు తెలుపగలరు.

AJY_

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)

210/-Only

Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST 9985413656 9985413365

SURYAPET DIST 9703618713, 9985401015

YADADRI BHONGIRI DIST 8885995946

నారి చేతిలో సిరిసంపద

● ధాన్యం సేకరణ ద్వారా మహిళా సంఘాలకు భారీగా కమీషన్ ● యాసంగిలో 1,77,228 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ ● రూ.3.44 కోట్ల కమీషన్ పొందిన మహిళా సంఘాలు

మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అతివలను భాగస్వాములను చేస్తూ ఆర్థిక పరిపుష్టి సాధించేలా చర్యలు తీసుకుంటోంది. యాదాద్రిభువనగిరి జిల్లా అధికారులు యాసంగి సీజన్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 30శాతం మహిళలకే అప్పగించారు. వారు విజయవంతంగా కేంద్రాలను నిర్వహించి అండగా నిలిచారు. యాసంగి సీజన్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేయడం, మిల్లులకు తరలించడం లాంటి బాధ్యతలు సమర్థంగా నిర్వహించారు.

● ఆంధ్రజ్యోతి, భూదాన్‌పోచంపల్లి



ధాన్యంకొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు (ఫైల్)

ధాన్యం కొనుగోలులో మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా శిక్షణ ఇచ్చారు. స్వయం సహాయ సంఘాల సభ్యులు అధికారులు, రైతులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా కాంటా వేయించి సకాలంలో మిల్లులకు ధాన్యం చేరేలా చూశారు. రైతులకు రావాల్సిన ధాన్యం డబ్బులను సకాలంలో వారి ఖాతాల్లో జమచేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం, అన్నదాతల మధ్య వారధిలా పనిచేసి ధాన్యం కొనుగోలు చేశారు.

కొనుగోలు చేసిన ధాన్యం ఇలా..

యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు 321 కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 91కేంద్రాలు ఏర్పాటు చేయగా వాటిని స్వయం సహాయక సంఘాలకు కేటాయించారు. గ్రామ సమైక్య సంఘాల ద్వారా అవసరాల మేరకు ముగ్గురు నుంచి ఐదుగురు మహిళా సభ్యులు ఈ కేంద్రాలు నిర్వహించారు. బుక్ కీపర్, తేమ శాతం చూడడం, సీఏ, ఇద్దరు సభ్యులు కొనుగోలు కేంద్రం బాధ్యతలు చూసుకున్నారు. మహిళా సంఘాలకే కేటాయించిన ఐకేపీ సెంటర్ల ద్వారా 1,77,228 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందుకుగాను క్వింటాకు రూ.32 చొప్పున ప్రభుత్వం కమీషన్ చెల్లించింది. మొత్తం రూ.3.44 కోట్లు మహిళా సంఘాల ఖాతాల్లో జమ కానున్నాయి. కమీషన్‌లో కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ఇతర ఖర్చులు పోను 50శాతం డబ్బులు స్త్రీనిధి ఖాతాలో జమ చేస్తారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మహిళా సహాయక సంఘాలకు 51 శాతం కేటాయించాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. వానాకాలం సీజన్‌లో 50 శాతం కేంద్రాలు కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యాసంగి సీజన్‌లో జిల్లాలోని శివారెడ్డిగూడెం, పెద్దగూడెం, జూలూరు, గోకారం, కక్కిరేణి, వెల్లంకి, శోభనాద్రిపురం గ్రామాల్లోని కేంద్రాల్లో పెద్దఎత్తున ధాన్యం సేకరించారు.

కొనుగోళ్లలో రాణించి..

ప్రభుత్వం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోళ్లలో స్వయం సహాయక మహిళా సంఘాలు కీలకపాత్ర పోషిస్తూ రూ.కోట్లలో వ్యాపారం చేశాయి. యాసంగి సీజన్‌లో తమకు కేటాయించిన ఐకేపీ ధాన్యం కొనుగోలుకేంద్రాల ద్వారా 1,77,228 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రూ. 3.44 కోట్లు కమీషన్ రూపంలో ఆర్జించాయి. ఇందిరా మహిళా శక్తి పథకాల ద్వారా అతివల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న ప్రభుత్వం ధాన్యం సేకరణలోనూ వారికి అవకాశం కల్పించడంతో మహిళా సంఘాలు సత్తా చాటాయి.

రాష్ట్రంలోనే మొదటి స్థానం



ధాన్యం కొనుగోళ్లలో స్వయం సహాయక సంఘాల పనితీరు బాగుంది. వారికిచ్చిన లక్ష్యాన్ని 45రోజుల్లోనే పూర్తి చేశారు. ఒక్క యాసంగి సీజన్‌లోనే కమీషన్ రూ.3.44 కోట్లు ఆర్జించారు. ప్రస్తుతం జిల్లా స్త్రీనిధి బ్యాంకులో ఐకేపీ కేంద్రాల డిపాజిట్లు రూ.12కోట్లు ఉన్నాయి. ఇది రాష్ట్రంలోనే మొదటి స్థానం. ఈ వానాకాలం నుంచి మొత్తం కొనుగోలు కేంద్రాల్లో 50 శాతం మహిళా సంఘాలకే కేటాయిస్తాం.

● నాగిరెడ్డి, డీఆర్‌డీవో, యాదాద్రి-భువనగిరి జిల్లా

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సైదులు బంధువులు, సైదులు (ఫైల్)

మర్రిగూడ, జూలై 17(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని మేటి చందాపురం ఇందుర్తి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలంలోని దామర గ్రామానికి చెందిన బత్తుల చంద్రమ్మ, నరసయ్య దంపతుల పెద్ద కుమారుడు బత్తుల సైదులు(25) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. బుధవారం మర్రిగూడ మండలంలోని మేటి చందాపురం ఇందుర్తి గ్రామానికి ఓ పని విషయంలో వెళ్లాడు. ఆ గ్రామంలోని ఓ ఇంటి ఆవరణలో క్రిమిసంహారక మందు తాగి అనుమానాస్పదస్థితిలో పడి ఉన్నాడు. గ్రామస్థులు దగ్గరికి వెళ్లి చూసే సరికి సైదులు మృతిచెంది ఉన్నాడు. గ్రామస్థులు వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి అతని కోసం ఆరా తీశారు. సైదులు నాంపల్లి మండలంలోని దామర గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ విషయం తెలిసిన సైదులు తల్లిదండ్రులు రాత్రి ఏడు గంటల సమయంలో పోలీసులను ఆశ్రయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన

తమ కుమారుడు ఆత్మహత్య చేసుకోలేదని, ఎవరో హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపిస్తూ గురువారం సైదులు తల్లిదండ్రులు, బంధువులు, దామర గ్రామస్థులు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. మృతికి కారకులైనవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. తమ కుమారుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

తవుడు లోడు లారీ దగ్ధం

వలిగొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తవుడు లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు టైరు పగిలి తవుడు పాటు లారీ గురువారం దగ్ధమైంది. మహారాష్ట్ర నుంచి తమిళ నాడుకు నుంచి తవుడు లోడుతో వెళ్తున్న లారీ యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ పరిధిలోకి చేరగానే ప్రమాదవశాత్తు లారీ టైరు పగిలింది. నిప్పురవ్వలు ఎగిసి పడి మంటలు అంటుకొని లారీలోని తవుడుతో పాటు లారీ కూడా దగ్ధమైంది. ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.22.90లక్షలు

నార్కట్‌పల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మండలంలోని చెర్వుగట్టు ఆలయ హుండీ ఆదాయం 34 రోజులకు రూ.22.90లక్షలు సమకూరింది. గట్టుకింద అమ్మ వారి హుండీ ఆదాయం రూ.3,59,890లు, గట్టుపైన స్వామి వారి హుండీ ఆలయం రూ.19,30,740 మొత్తం రూ.22,90,630ల ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదానం ద్వారా రూ.65,120 ఆదాయం వచ్చినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో నల్లగొండ దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.భాస్కర్, దేవస్థాన కార్యనిర్వహణ అధికారి ఎస్. నవీన్, శ్రీదుర్గా శివసాయి సేవా సమితి సభ్యులు హెచ్‌డీఎఫ్‌సీ నల్లగొండ బ్రాంచీ సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

నల్లగొండ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ విశ్వ విద్యాలయం పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణ సరళిని ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి, సీవోఈ ఉపేందర్‌రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని కాపీయింగ్ పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ ప్రియ, ఇతర అధ్యాపక బృందం ఉన్నారు.

షోకాజ్ నోటీసులు జారీ

మర్రిగూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాల వసతి గృహంలో విద్యార్థులు కడుపు నొప్పితో అస్వస్థతకు గురైన ఘటనలో వసతి గృహం ఫుడ్ ఇన్‌చార్జితో పాటు నర్సు, వార్డెన్(టీకర్) ముగ్గురికి జిల్లా విద్యాశాఖ అధికారి గురువారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. బుధవారం వసతి గృహాన్ని సందర్శించి సిబ్బంది విధి నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో వివరణతో పాటు సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

ఇష్టంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

వలిగొండ/ రామన్నపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి, ఇష్టంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇంటర్‌బోర్డు జాయింట్ సెక్రటరీ భీమ్‌సింగ్ తెలిపారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలకేంద్రంలో శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల, రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలల్లోని వసతులను పరిశీలించారు. ఇంటర్మీడియట్ కీలకమని వారి భవిష్యత్తు మారుస్తుందన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలన్నారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకూడదని సూచించారు. ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశం పొందే విద్యార్థులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. గత సంవత్సరంలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వలిగొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతకుమార్, రామన్నపేట జీజేసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రసన్నదేవి, అధ్యాపకులు డాక్టర్ పరుశరాములు, కృష్ణ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: కళాశాలల్లో డ్రాపవుట్లు లేకుండా చూడాలని ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రటరీ భీమ్‌సింగ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. అధ్యాపకులు అడ్మిషన్లు పెంచడంపై దృష్టి సారించాలని, పదో తరగతి సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థులను కలవాలని ఆదేశించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంటర్ కళాశాలలకు ప్రభుత్వం నిధులు సమకూరుస్తోందని, ఆయా నిధులతో కళాశాలలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యత, సాంకేతికతతో కూడిన బోధన చేయాలని సూచించారు. క్రీడా పరికరాలు, ప్రాక్టికల్ సామాగ్రి సమకూర్చాలని, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఉత్తమ ర్యాంకులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఈవో దస్రునాయక్. పాఠశాల ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్, అధ్యాపకులు కృష్ణకుమారి, జ్యోత్స్న, వరలక్ష్మీ, సంధ్య, సల్మా, మధు, అరిస్టాటిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

● మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట పెట్రోల్ బాటిళ్లు, పురుగుల మందు డబ్బాలతో బాధితుల ఆందోళన



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

మిర్యాలగూడ, జూలై 17(ఆంధ్రజ్యోతి): తమ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. మొల్క చర్ల గ్రామానికి చెందిన దైద రమణ, దైద శ్రీను కుటుంబసభ్యులు ఉదయం 11 గంటలకు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. తమకు న్యాయం చేసే వరకు కదిలేదిలేదని భీష్మించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవిదేవులపల్లి మండలం మొల్క చర్ల గ్రామం సర్వే నెంబర్ లో తమ పేర పట్టాకలిగిన 153బై 151, 163, 163బై2 లోని మూడు ఎకరాల ఇనాం భూముల ను మాజీ సీఎం వైఎస్ హయాం నుంచి సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని తెలిపారు. తమ భూమిలోకి అదే గ్రామానికి చెందిన పాతులోతు సుజాత, రాంకోటి రాత్రి సమయాల్లో యంత్రాలు, మంది మార్బలంతో వచ్చి చెట్లు నరికి, భూమి దున్ని కబ్జాకు యత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో అడవి దేవులపల్లి తహసీల్దార్‌కు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆ భూమికి ఆనుకుని ఉన్న మా పేర పట్టాకలిగిన ఇనాం భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తూ చంపుతామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి తమ భూములకు, తమకు రక్షణ కల్పించాలని లేకుంటే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడతామని భీష్మించారు. పూర్తిస్థాయి లో విచారణ జరిపి న్యాయం జరిగేలా చూస్తానని సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అసలే ఇరుకు.. ఆపై మలుపు

● రైల్వే గేటు కష్టాలు తప్పినా.. యూటర్న్ టెన్షన్
● ఎవరు ఎటు వెళుతున్నారో తెలియక తికమక
● కనిపించని వేగ నియంత్రణ సూచికలు



హైవే అండర్‌పాస్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న బస్సు, ఇతర వాహనాలు

బీబీనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలకేంద్రంలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణంతో గేటు కష్టాలు తప్పాయనుకుంటే.. హైవే అండర్ పాసింగ్ వద్ద ఫ్లైఓవర్ ముగింపు వద్ద యూటర్న్ పాయింట్ వాహనాదారులను టెన్షన్ పెడుతోంది. వాహనాలు మలుపు తిరిగే క్రమంలో ఎవరు ఎటువైపు వెళ్తున్నారో తెలియక ముచ్చెమటలు పడుతున్నాయి. బ్రిడ్జిపై వేగ నియంత్రణ చర్యలు తీసుకోని కారణంగా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో బ్రిడ్జిపై ప్రయాణం చేయాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాల బారిన వాహనదారులు

బీబీనగర్ మండలకేంద్రం మీదుగా హైదరాబాద్, భువనగిరి వైపు నిత్యం రాకపోకలు కొనసాగించే సుమారు 50గ్రామాల ప్రజలకు రైల్వే గేటు తిప్పలు తప్పించేందుకు అప్పటి ప్రభుత్వం రైల్వే మార్గంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించింది. మండలంలోని రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం ముందు నుంచి బ్రిడ్జి మొదలై హైదరాబాద్ వైపున హైవే అండర్ పాసింగ్‌లను కలుపుతూ 600మీటర్ల పొడవున ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించారు. బ్రిడ్జి ముంగిపు వద్ద బీబీనగర్ పాత గ్రామంలోని, బైపాస్ రోడ్డుకు, హైదరాబాద్ వైపుకు వెళ్లే వారి కోసం యూ టర్న్ పాయింట్ పెట్టారు. ఈ ప్రదేశం ఇరుకుగా ఉంటుంది. ఒక వైపు రైల్వే ట్రాక్ మరో వైపు హైవే బ్రిడ్జి సపోర్ట్ వాల్ నిర్మించి ఉన్నాయి. దీంతో పాత బీబీనగర్ గ్రామం వైపు నుంచి పట్టణంలోకి.. పట్టణం నుంచి పాత గ్రామంలోకి నిత్యం రాకపోకలు కొనసాగించే ఆర్టీసీ బస్సు లతో పాటు ఇతర ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలకు చెందిన బస్సులు యూటర్న్ చేసుకునే క్రమంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. బస్సులు, ఇతర పెద్ద వాహనాలు, ఇక్కడ మలుపు తీసుకుంటున్న సమయాల్లో రెండు వైపులా వెళ్లాల్సిన వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. ఓ వైపు ఎయిమ్స్ ఆసుపత్రి, ఇటు వైపు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు ఉండడంతో వాహనాల రద్దీ పెరిగింది. బ్రిడ్జిపై నుంచి పట్టణంలోకి ప్రవేశంతో పోచంపల్లి చౌరస్తా వాహనాల సందడి ఉంటుంది. నాలుగు వైపులా నుంచి వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇక్కడ వాహనాల క్రమబద్దీకరణ వేగ నియంత్రణకు ఎలాంటి చర్యలు సూచికలు లేని కారణంగా వాహనాదారులు తికమక పడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



రైల్వే బ్రిడ్జిపై వేగ నియంత్రణ లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని పోచంపల్లి చౌరస్తాలో, హైవే, హైదరాబాద్ వైపు, హైవే అండర్ పాసింగ్ దగ్గర యూటర్న్ వద్ద వాహనదారులను నియంత్రించే వ్యవస్థ లేక ఎవరు ఎటు వైపు వెళ్తారో గమనించలేక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

దేవరుప్పల పృథ్వీకుమార్, బీబీనగర్.

చింతన

అంతటా ఆయనే!

ఏ సుఖశాంతుల కోసం అన్వేషిస్తున్నామో అవి తమలోనే ఉన్నాయనే విషయం చాలామందికి తరచుగా అర్థం కాదు. శాంతిని పొందాలంటే ప్రత్యేకంగా ఏదో చెయ్యాలనుకుంటారు. అందువల్లనే నా దగ్గరకు వచ్చేవారిలో చాలామంది "మమ్మల్ని ఆశీర్వదించండి" అని అడుగుతూ ఉంటారు. కానీ సమస్త సృష్టిని రచించిన ఆ దివ్యశక్తి హస్తం తమపై ఉందని వారు గుర్తించడం లేదు. నక్షత్రాలను, సూర్య చంద్రులను, ఈ భూమిని సృష్టించినవాడి ఆశీర్వాదం అందరి వెంటా ఉంది. మీలోనికి శ్వాస వస్తూ, పోతున్నంతకాలం ఆయన చెయ్యి మీ తలపై ఉన్నట్టే! కాబట్టి ఏ ఇతర ఆశీర్వాదం మీకు అవసరం లేదు. అన్నీ మీ సమక్షంలోనే ఉన్నాయి. కానీ మీ లోపలి నేత్రాలను తెరిచినప్పుడు మాత్రమే సత్యమేమిటో మీకు గోచరిస్తుంది. ఏదో చేయడం వల్ల శాంతి చేకూరదు. చాలామందికి ఈ విషయంలో ఎన్నో అపోహలు ఉంటాయి. ఏ శాంతి కోసం మీరు అన్వేషిస్తున్నారో... అది బయట ఎక్కడో లేదనీ, మీలోనే ఉందనే విషయాన్ని హృదయంతో మీరు గ్రహించలేనప్పుడు... మీకు అన్నీ ఉన్నప్పటికీ ఏదీ సాధించలేరు.

తప్పు అక్కడే ఉంది...

నేను మీకొక చిన్న కథ చెబుతాను. పూర్వం ఒక వ్యక్తి ఒక కొండమీద చిన్న పూరి గుడిసెలో ఉండేవాడు. పొద్దున్నే పక్షుల కిలకిలరావాలను విని నిద్రలేచి, తన దైనందిన కార్యక్రమాలు నిర్వహించేవాడు. ఒక రోజు అతను లేచేసరికి ఏదీ కనిపించడం లేదు. 'సూర్యుడు ఇంకా ఉదయించడం లేదు' అనుకున్నాడు. అంతా చీకటిగా ఉందని అగ్గిపుల్ల వెలిగించాడు. కానీ ఆ వెలుగు కూడా కనిపించలేదు. బయటకు వెళ్ళాక ఎండ తగిలింది, కానీ సూర్యుడు కనిపించలేదు. 'ఈ రోజు సూర్యుడు ఎందుకో వెలుగు ఇవ్వడం లేదు' అనుకున్నాడు. ఇంతలో ఒక సాధువు అటువైపు వెళ్తూ... ఇతన్ని పలకరించాడు. ఆయనకు తన సమస్యను ఈ వ్యక్తి చెప్పుకున్నాడు. "సూర్యుడి వెలుగు లేకపోవడం కాదు, నీ కళ్ళలో ఏదో లోపం ఉంది" అన్నాడు ఆ సాధువు. అప్పుడు తప్పు ఎక్కడ ఉందో ఆ వ్యక్తికి తెలిసింది. అతనికి కళ్ళు సరిగ్గా కనిపించకపోవడం వల్లనే సూర్యుడి వెలుగు కనిపించలేదు. అంతా చీకటిగా అనిపించింది.



ఆ సంగతి మరువకండి...

మనలో చాలామంది ఏదో ఒక సందర్భంలో భగవంతుడితో "నువ్వుంటూ ఉంటే నా ముందుకు రా!" అని సవాలు చేసే ఉంటారు. కానీ కష్టనష్టాలు ఎదురైనప్పుడు మాత్రమే మనం భగవంతుడివైపు చూస్తాం. అంతకుముందు మన దైనందిన కార్యకలాపాలలో లీనమై ఉంటాం. ఈ ప్రపంచంలో భగవంతుడు లేని చోటంటూ ఏదైనా ఉందేమో చెప్పగలరా? ఆయన అంతటా వ్యాపించి ఉన్నాడు. మీరు అంతర్ముఖంగా చూస్తే... అక్కడ మీకు ఆయన కనిపిస్తాడు. ఈ విషయాన్ని అర్థం చేసుకున్నప్పుడు... ఆయన సదా మనతోనే ఉన్నప్పటికీ ఆయనను మనం ఎప్పుడూ చూడలేదని, అందుకే ఈ ప్రాపంచిక జంజాటాలనే భారాన్ని మోస్తున్నామని మనకు బోధపడుతుంది. ఆయనను గుర్తించలేకపోతే... ఉత్త చేతులతో వచ్చిన మనం ఉత్త చేతులతోనే మిగిలిపోతాం. ఈ ప్రపంచంలో 'జీవితం' అనే పువ్వు నుంచి మకరందాన్ని సేకరించే మార్గాన్ని మనం తెలుసుకోవాలి. అది తెలియకపోతే ఇలాగే ఉండిపోయి ఆకలితో అలమటిస్తాం. మీ జీవితంలో ఏది జరిగినప్పటికీ... మీరు ఎంతో సౌభాగ్యశీలులు అనే విషయం మాత్రం ఎన్నటికీ మరువకండి.



ప్రేమ్‌రావత్
9246275220



ఆలయ దర్శనం

యోగఫలాలు అందించే అగస్త్యేశ్వరుడు

త్రికాలవేదిగా ఖ్యాతిగాంచిన అగస్త్య మహర్షి గొప్ప తపస్సంపన్నుడు. ఆయన త్రేతాయుగంలో ప్రతిష్ఠించినవిగా పేరుపొందిన అయిదు ఆలయాలు... పంచ అగస్త్యేశ్వర ఆలయాలుగా ప్రసిద్ధి చెందాయి. అవి పూర్వ తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని తాపేశ్వరం, ఆర్తమూరు, మండపేట, వల్లూరు, చెల్లూరులలో ఉన్నాయి. తాపేశ్వరంలో (ప్రస్తుత కోనసీమ జిల్లా) పశ్చిమాభిముఖంగా ఉన్న శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామివారి ఆలయాన్ని దర్శించినవారికి అద్భుతమైన యోగ ఫలితాలు లభిస్తాయని ప్రతీతి. ఈ ఆలయానికి ఉత్తరదిశగా తుల్యభాగ నది ప్రవహిస్తున్నందున... దీన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.



వాతాపి జీర్ణం...

స్థల పురాణం ప్రకారం... త్రేతాయుగంలో వాతాపి, ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షసులు ఉండేవారు. వారు కామరూపులు. వాతాపిని ఇల్వలుడు గొర్రెగా మార్చి, ఆహారం వండి, తమ ఇంట పితృకార్యం పేరుతో బాటసారులకు భోజనాలు పెట్టేవాడు. వారు తిన్న తరువాత... "వాతాపీ బయటకు రా" అని ఇల్వలుడు పిలవగానే... భోజనాలు చేసినవారి ఉదరాలను చీల్చుకుంటూ వాతాపి వచ్చేవాడు. అలా మరణించినవారిని ఇల్వలుడు, వాతాపి రాక్షస రూపాల్లోకి మారి ఆరగించేవారు. ఈ విషయం తెలిసిన అగస్త్యుడు వారి వద్దకు వెళ్ళి, భోజనం చేసిన తరువాత "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అన్నాడు. అగస్త్యుడి ఉదరంలో కామరూపంలో ఉన్న వాతాపి పూర్తిగా జీర్ణమైపోయాడు. అందుకనే ఇప్పటికీ ఇళ్ళల్లో పిల్లలకు ఉగ్గు పట్టిన తరువాత పెద్దలు "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అంటారు. ఆ తరువాత ఇల్వలుణ్ణి కూడా తన తపశ్శక్తితో అగస్త్యుడు సంహరించాడు. వారిలో బ్రాహ్మణత్వం ఉండడం వల్ల అగస్త్యుడికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. ఆయన శివుణ్ణి ప్రార్థించి, స్వామి అనుగ్రహంతో ఇక్కడ శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామిని ప్రతిష్ఠించడంతో... ఆయనకు చుట్టుకున్న బ్రహ్మహత్యాపాతకం నశించింది. ఈ ఊరి పేరు పూర్వం 'వాతాపిపురం' కాగా... కాలక్రమేణా తాపేశ్వరంగా మారింది.

> **ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయాన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.**

అత్యంత పురాతనం

ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయం అత్యంత పురాతనమైనదని, ఈ ఆవరణలో ఉన్న రెండు నాగమల్లి చెట్లకు సుమారు 200 సంవత్సరాల చరిత్ర ఉందని డెబ్బయ్యేళ్ళ నుంచి ఆలయ అర్చకుడిగా ఉన్న శంకరమంచి సుబ్రహ్మణ్య శర్మ చెప్పారు. ఆలయ ప్రాంగణంలోని ప్రాచీనమైన గిలకబావిలోని నీటినే స్వామి అభిషేకాల కోసం నేటికీ వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. కాగా కొన్నేళ్ళ క్రితం ఈ ఆలయాన్ని స్థానిక సురుచి ఫుడ్స్ యజమాని పోలిశెట్టి మల్లిబాబు సుమారు కోటి రూపాయల ఖర్చుతో పునర్నిర్మించారు. ఇది తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆయన చెబుతున్నారు. కాకినాడ నుంచి రామచంద్రపురం మీదుగా, రాజమండ్రి నుంచి జొన్నాడ, ఆలమూరు, మండపేట మీదుగా తాపేశ్వరం చేరుకోవచ్చు.

• సి.ఎన్.మూర్తి
8328143489

సందేశం


కష్టాల్లో సహనం

"కష్టం వెనుక నిశ్చయంగా సుఖం ఉంటుంది. ఏ ఒక్కరి మీదా వారు భరించేగలిగేదానికన్నా ఎక్కువ భారాన్నీ, బాధ్యతను అల్లాహ్ మోపడు" అని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ ఒక సందర్భంలో చెప్పారు. దానికి ఉదాహరణగా పేర్కొనే కథ ఇది. ఒక ఊరిలో ఒక బాలుడు ఉండేవాడు. అతను ఊరి చివర్లో ఉండే పాఠశాలలో చదివేవాడు. అతనికి ప్రకృతి అంటే చాలా ఇష్టం.

ఒక రోజు అతని ఉస్తాద్ (గురువు) పిల్లలకు పాఠం చెబుతూ... "తను సృష్టించిన ప్రతిదానిలో అల్లాహ్ ఒక హిక్మత్ (జ్ఞానం) ఉంచాడు. దాన్ని మనం కచ్చితంగా గమనించాలి" అని బోధించారు. ఈ మాటలు ఆ బాలుడి మనస్సులో బలంగా నాటుకుపోయాయి. ఆ రోజు సాయంత్రం తన ఇంటి దగ్గర ఉన్న తోటలోకి వెళ్ళాడు. అతనికి ఒక పట్టుపురుగు కనిపించింది. ఆ పురుగు తన చుట్టూ ఒక గూడు తయారు చేసుకుంటోంది. ఆ బాలుడికి చాలా ఆశ్చర్యం కలిగింది. 'ఈ పురుగు ఇలా ఎందుకు చేస్తోంది? ఆ తరువాత దాని నుంచి బయటకు రావడానికి ఎందుకు అన్ని కష్టాలు పడుతోంది?' అని ఆలోచించాడు.

కొద్ది రోజులకు ఆ పురుగు పెద్దదయింది. రెక్కలు రావడం కోసం శ్రమ పడుతోంది. ఈ దశను గమనించిన ఆ బాలుడి హృదయం చలించిపోయింది. దానికి సాయం చెయ్యాలనుకున్నాడు. దాని చుట్టూ ఉన్న గూడును (కోకూన్) ఒక చిన్న కత్తెరతో మెల్లగా కత్తిరించాడు. అప్పుడు ఆ పురుగు బయటకు వచ్చింది. కానీ రెక్కలు బలహీనంగా ఉండడంతో ఎగరలేకపోయింది. కొద్దిసేపటికే ప్రాణం కోల్పోయింది. ఆ బాలుడు తీవ్రమైన దుఃఖంలో మునిగిపోయాడు. మర్నాడు బడికి వెళ్ళి... తను చేసిన పనిని గురువుకు చెప్పాడు.

అప్పుడు ఆ గురువు "నాయనా! ఇలాంటి ప్రతి శ్రమలో అల్లాహ్ జ్ఞానాన్ని ఉంచాడు. ఆ పురుగు తన శరీరాన్ని ఒత్తిడి చేసి బయటకు రావడం ద్వారా దాని రెక్కలకు బలం వస్తుంది. నువ్వు చేసిన సాయం నీకు దయగా కనిపించవచ్చు. కానీ అది సాయం కాదు. అల్లాహ్ కొన్ని పరీక్షల ద్వారా మనల్ని బలోపేతం చేస్తాడు. ఆ సమయంలో మనం సహనం చూపిస్తే మనం బలంగా రూపుదిద్దుకుంటాం" అని వివరించారు. 'ప్రతి కష్టం మనకోసం అల్లాహ్ పెట్టే ఒక పరీక్ష, ఒక బహుమానం' అనే 'దివ్య ఖుర్‌ఆన్' వాక్యాలను చదివి వినిపించారు.



'కష్టాల్లో సహనం చూపించేవారికి అల్లాహ్ మేలు చేస్తాడు' అనే విషయం ఆ బాలుడికి అర్థమయింది. గురువుకు సలామ్ చేసి ఇంటికి బయలుదేరాడు.


• మహమ్మద్ వహీదుద్దీన్

సహజయోగ

భక్తే కాదు, విశ్వాసమూ ప్రధానమే

భగవంతుణ్ణి ప్రసన్నం చేసుకోవాలి. ఇది ప్రతి భక్తుడూ కోరుకొనే విషయమే. కానీ ఇది అంత సులభమైనది కాదు. భగవంతుడి ఆశీస్సులు పొందాలంటే... ఆయనపై అనన్యమైన భక్తి, అపరిమితమైన విశ్వాసం ఉండాలి. అంతేకాదు, తమ కోరిక స్వార్థ ప్రయోజనాలకోసం కాకుండా... ప్రజాహితంగా, సమాజహితంగా ఉండాలనేది కూడా భక్తులు గ్రహించాలి. పరమేశ్వరుడిమీద మన నమ్మకం ఎంత కచ్చితంగా, ఎంత నిజాయితీగా ఉండాలో సహజయోగ ప్రదాత శ్రీమాతాజీ నిర్మలాదేవి ఒక కథలో వివరించారు.

దేవుడికి ప్రీతిపాత్రుడైన ఒక భక్తుడు ఆయనను దర్శించుకోవడానికి బయలుదేరాడు. దారిలో ఒక ముని ఎదురుపడ్డాడు. అతను దేనికోసమో ఎదురుచూస్తున్నట్టు కనిపించాడు. "నేను భగవంతుణ్ణి కలుసుకోవడానికి వెళ్తున్నాను. నీకు ఏదైనా కోరిక ఉంటే చెప్పు. ఆయనకు తెలియజేస్తాను" అన్నాడు ఆ భక్తుడు. "అలాగా... సంతోషం. నాకు తినడానికి ఇప్పటివరకూ ఆహారం రాలేదు. కాస్త తొందరగా ఏర్పాటు చేయమని భగవంతుడికి చెప్పండి" అన్నాడు ఆ ముని. అతను తనను ఎగతాళి చేస్తున్నాడనుకున్న ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. మరికొంత దూరంలో మరో ముని తారసపడ్డాడు. అతను తల్లక్రిందులుగా, ఎంతో క్లిష్టతరమైన తపస్సు చేస్తూ నానా తిప్పలూ పడుతున్నాడు. "నేను భగవంతుడి దగ్గరకు వెళ్తున్నాను. నీ గురించి ఏదైనా చెప్పమంటావా?" అని అడిగాడు భక్తుడు. "ఆయన దర్శనం కోసం నేను ఎంతో కాలంగా తపస్సు చేస్తున్నాను. ఇంకా ఎంతకాలం ఎదురుచూడాలో అడుగు" అన్నాడతను. 'సరే'నంటూ ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. భగవంతుణ్ణి కలుసుకున్నాడు. భగవంతుడు అతణ్ణి కుశల ప్రశ్నలు అడిగాడు. "ఇంకా ఏదైనా అడగాలా?" అన్నాడు. అప్పుడు ఆ భక్తుడు రెండో ముని సందేహాన్ని చెప్పాడు. "కంగారేమీ లేదు. అతను ఇంకా తపస్సు చేయాల్సిందే" అన్నాడు. ఆ తరువాత మొదటి ముని కోరిక గురించి చెప్పాడు. భగవంతుడు వెంటనే తన సేవకులను పిలిచి... ఆ ముని కోరుకున్న ఆహారాన్ని వెంటనే పంపించాలని ఆజ్ఞాపించాడు. "అదేమిటి స్వామీ! అంత కఠోర తపస్సు చేస్తున్న వ్యక్తిని ఇంకా కొంతకాలం వేచి ఉండాలంటున్నారు. తిండికోసం ఆరాటపడుతున్నవాడికి వరం ప్రసాదించారు. ఎందుకని?" అని అడిగాడు భక్తుడు. "సరేగానీ... ఆ మునులతో నేను భగవంతుణ్ణి కలిసే సమయానికి ఆయన సూది బెజ్జం నుంచి ఒంటెను బయటకు తీస్తున్నాడు" అని చెప్పు. అంతే! అప్పుడు నీకే అర్థమవుతుంది" అన్నాడు దేవుడు.



అది హృదయం లోతుల్లోంచీ రావాలి...

ఆయన దగ్గర సెలవు తీసుకున్న భక్తుడు అక్కడినుంచి బయలుదేరాడు. తపస్సు చేసుకుంటున్న ముని దగ్గరకు వచ్చాడు. "నువ్వు ఇంకా తపస్సు చేయాల్సి ఉందని దేవుడు చెప్పాడు. అయితే ఆయనను కలుసుకున్నప్పుడు... సూది బెజ్జంలోనుంచి ఒక ఒంటెను తీస్తూ ఉంటే కళ్ళారా చూసి ఆశ్చర్యపోయాను" అన్నాడు. అప్పుడు ఆ ముని "అది అసాధ్యమైన కార్యం. నువ్వు ఆయన దగ్గరకు వెళ్ళలేదు. కేవలం నన్ను నమ్మించడం కోసం ఇలా చెబుతున్నావు" అని కొట్టి పారేశాడు. ఆ తరువాత... తను మొదట కలుసుకున్న ముని దగ్గరకు భక్తుడు వెళ్ళాడు. అప్పటికే ఆ ముని... తనకు దేవుడు పంపిన ఆహారం తిని ఆనందంలో ఉన్నాడు. "భగవంతుడు సూది నుంచి ఒంటెను బయటకు తీయడం చూసి ఆశ్చర్యం కలిగింది. అలాంటి అద్భుతాన్ని ఎప్పుడూ చూడలేదు" అని చెప్పాడు భక్తుడు. అందుకు ఆ ముని "ఇందులో అద్భుతం కానీ, ఆశ్చర్యపడాల్సినది కానీ ఏముంది? ఆయన సర్వేశ్వరుడు. ఆయనకు సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. ఒంటెను ఏమిటి? సూది బెజ్జంలోంచి విశ్వాలన్నిటినీ తీయగల సమర్థుడు" అని చాలా ధీమాగా చెప్పాడు. భక్తి శ్రద్ధలు మాత్రమే కాదు, భగవంతుడి మీద అచంచలమైన విశ్వాసం తప్పనిసరిగా ఉండాలని చెప్పే అనేక ఉదాహరణలు మన పురాణ గ్రంథాలలో ఉన్నాయి. పైన చెప్పిన కథలో మనం తెలుసుకోవాల్సినది ఏమిటంటే... భగవంతుడి శక్తి మీద భక్తుడికి ప్రగాఢ విశ్వాసం ఉండాలి. ఆ విశ్వాసం హృదయం లోతుల్లోంచీ రావాలి. ఆత్మ ద్వారా వ్యక్తం కావాలి.

అన్నీ సాధ్యమే...

కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందిన సహజ యోగులకు... వారి ఆత్మ విశ్వాసం ద్వారా ఇది సులభసాధ్యం అవుతుంది. అప్పుడు అది అంధ విశ్వాసం కాదు. ఆత్మ వికాసంతో సాధించుకున్న విశ్వాసం. మనలో నిగూఢంగా, నిద్రాణ స్థితిలో ఉన్న దివ్యశక్తి అయిన కుండలినీ శక్తి... ఒక సద్గురువు సమక్షంలో జాగృతి చెందాలి. ఆత్మసాక్షాత్కారాన్ని అనుభూతిపరంగా మనం స్వయంగా గ్రహించాలి. భగవంతుడి ప్రేమను, అనుగ్రహాన్ని తక్కువగా అంచనా వేసుకోలేం కదా! మరి ఆత్మ సాక్షాత్కారాన్ని ఆయన సునాయాసంగా ప్రసాదిస్తాడనే విషయంలో సందేహం ఎందుకు? అంతా ఆయన ఇష్టప్రకారమే జరుగుతుంది. ఆయనను ప్రశ్నించడానికి, అంచనా వేయడానికి మనమెవరం? మనకు ఉండవలసినది ఆయన మీద, ఆయన శక్తి మీద తిరుగులేని విశ్వాసం మాత్రమే. దాని ద్వారా అన్నీ సాధ్యమేనని నమ్మాలి.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

దైవమార్గం

అత్తాకోడళ్ల కథ

బైబిల్‌లో రూతు కథ ఆసక్తికరంగా ఉంటుంది. అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తా కోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.

బెత్లెహేములో నివసించే నయోమి యూదు మతాన్ని అనుసరించే వ్యక్తి. ఆమెకు ఇద్దరు కుమారులు. భర్త మరణంతో, అనంతరం తమ ప్రాంతంలో కరువు ఏర్పడడంతో... బిడ్డలతో పాటు మోయబ్ ప్రాంతానికి బతుకుతెరువు కోసం నయోమి పయనమైంది. అక్కడే తన పిల్లలకు పెళ్ళిళ్ళు చేసింది. ఆమె కోడళ్ళు ఇద్దరూ యూదులు కాదు. అన్యమతస్తులు. కాగా... కొన్నాళ్ళకు నయోమి కుమారులు ఇద్దరూ మరణించారు. వారికి పిల్లలు లేరు. ఈ పరిస్థితుల్లో... తన సొంత ప్రాంతమైన బెత్లెహేముకు తిరిగి వెళ్ళాలని నయోమి నిర్ణయించుకుంది. కోడళ్ళను పిలిచి... "మీరు ఇక్కడే... మీ తల్లితండ్రుల దగ్గర ఉండిపోండి" అని చెప్పింది. ఒక కోడలు సరేనంది. మరో కోడలైన రూతు "నీవే నాకు తల్లివి, తండ్రివి. వయసు ఉడిగిపోయి, కష్టపడలేని సమయంలో నిన్ను ఇలా విడవడం నాకు భావ్యం కాదు. నిన్ను ఒక్కదాన్నీ విడిచిపెట్టి నేను ఎలా సంతోషంగా ఉండగలను? నీతోనే నా పయనం, నా జీవనం. నీ దేవుడే నా దేవుడు" అని చెప్పింది.

అలా అత్తగారితోనే ఉండిపోయిన రూతు... క్రమంగా అత్త కొలిచే దేవుణ్ణి ఇష్టపడింది. నయోమిని తన తల్లిలా ప్రేమించింది. నయోమి కూడా తన కోడలు గురించి, ఆమె భవిష్యత్తు గురించి ఆలోచించడం మొదలుపెట్టింది.

బెత్లెహేముకు తిరిగి వచ్చిన తరువాత... తన దగ్గర బంధువైన బోయజు అనే పెద్ద భూస్వామి పొలంలో పరిగె ఏరుకోవడానికి రూతును నయోమి పంపింది. రూతు అందం,

> **అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తా కోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.**



వినయం, అత్తగారికి చేసే సేవలు చూసి మనసు పడిన బోయజు... ఆమెను తన భార్యగా స్వీకరించాడు. వారికి ఒక కుమారుడు. ఆ రూతు... క్రీస్తు వంశానికి పూర్వీకురాలు. ఆ అత్తాకోడళ్ళ మధ్య ప్రగాఢంగా అల్లుకుపోయిన బంధాలు ప్రతి కుటుంబంలో నెలకొనవలసిన విలువైన ఆదర్శంగా ఎప్పటికీ నిలుస్తాయి.


• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

జెన్ కథ

మూర్ఖ శిఖామణి

జపాన్‌లో ఒక గొప్ప జెన్ గురువు ఉండేవాడు. అతని పేరు ర్యోకాన్. అందరూ 'మూర్ఖ శిఖామణి' అని పిలిచేవారు. ర్యోకాన్ వింత ప్రవర్తనే దానికి కారణం. కానీ అతను సామాన్యమైన గురువు కాదు. ఎందరికో అతీంద్రియానుభవాన్ని కలిగేలా చేసిన మహనీయుడు. ర్యోకాన్ చాలా చిన్న వయసులోనే ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. కొషోజీ ఆలయంలో ఏకాంతంగా గడిపేవాడు.

ఒక రోజు కోకుసెన్ అనే గురువు ఆ ఆలయానికి వచ్చాడు. ఆయనలో ఏదో శక్తి ర్యోకాన్‌ను ఆకర్షించింది. ఆయనకు ఇతను శిష్యుడయ్యాడు. ఆయన వెంట ఎట్సుంజీ మఠానికి వెళ్ళి... అక్కడ ధ్యానంలో గడిపేవాడు. కొన్నేళ్ళకు కోకుసెన్ మరణించాడు. ఆలయంలో పూజారిగా ఉండడం ర్యోకాన్‌కు ఎప్పుడూ ఇష్టం లేదు. కాబట్టి తనకు నచ్చిన విధంగా, నచ్చిన చోట ఉండాలని నిర్ణయించుకొని... తీర్థయాత్రలు చేశాడు. కవితలు రాస్తూ, పిల్లలతో ఆడుతూ, పాడుతూ గడిపేవాడు. జెన్ సన్యాసులు సాధారణంగా మాంసం తినేవారు కాదు. కానీ ఎవరైనా చేపలను వడ్డిస్తే ర్యోకాన్ హాయిగా తినేవాడు. "నేను చేపలను తింటాను. ఈగలకు, దోమలకు నా దేహాన్ని విందు భోజనం కింద ఆనందంగా సమర్పిస్తాను" అంటూ ఉండేవాడు. పండుగల్లో మహిళలు మాత్రమే పాల్గొనే కార్యక్రమాలు కొన్ని ఉండేవి. ర్యోకాన్ స్త్రీ వేషధారణలో వెళ్ళి ఆ కార్యక్రమాల్లో పాల్గొనేవాడు.



అతని కుటీరానికి ఒక రోజు రాత్రి ఒక దొంగ వచ్చాడు. ఏదీ దొరక్క అతను వెళ్ళి పోతూ ఉంటే... ర్యోకాన్ అతన్ని ఆపాడు. "ఉత్త చేతులతో నా ఇంటి అతిథి వెళ్ళరాదు. ఇదిగో! నా వస్త్రాన్ని తీసుకువెళ్ళు" అంటూ తాను కట్టుకున్న వస్త్రాన్ని అతనికి ఇచ్చేశాడు. దిగంబరంగా కూర్చొని ఆకాశంలో చంద్రుణ్ణి చూస్తూ పరవశించిపోయాడు. ఎప్పుడూ ఏకాంతంగా నడుస్తూ, హృదయం నుంచి పొంగి పొరలే కవితల్ని వర్ణిస్తూ హాయిగా గడిపే ర్యోకాన్‌కు శిష్యులంటూ ఎవరూ ఉండేవారు కాదు. కానీ ఎందరో ఆయననుంచి ప్రేరణ పొంది ధ్యానం చేసేవారు. ధ్యానంలో అత్యున్నత శిఖరాలను అందుకొనేవారు. ఆధ్యాత్మిక చింతనలో నిమగ్నమైన ర్యోకాన్ లౌకిక విషయాలను ఎలాంటి క్రమం లేకుండా అనుసరించేవాడు. చెప్పులను తలమీద పెట్టుకొనేవాడు. వస్త్రం లేకుండా వీధుల్లో నడిచేవాడు. తలపైన ఉండవలసిన టోపీని కాలికి తగిలించుకొనేవాడు. తనలోతాను నవ్వుకొనేవాడు. ఇదంతా గమనించిన ప్రజలు అతణ్ణి 'మూర్ఖ శిఖామణి' అంటూ వ్యవహరించేవారు. ఒక గ్రామంలో ర్యోకాన్‌ని దొంగగా భావించిన ప్రజలు అతణ్ణి సజీవంగా పాతి పెట్టారు. ర్యోకాన్‌తో పరిచయం ఉన్న టైషన్ అనే సన్యాసిని ఈ వివరాలను లోకానికి వెల్లడిస్తూ... ఆయనను జ్ఞాన శిఖామణిగా కీర్తించింది.

• రాచమడుగు శ్రీనివాసులు

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

సూర్యాపేటఅర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విడనాడాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పనిగంటలు పెంచాలనే ప్రభుత్వాల నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రతి కార్మికుడూ పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఎం.రాంబాబు, నెమ్మాది వెంకటేశ్వర్లు, ఏకలక్ష్మి, బుర్రి శ్రీనివాస్, ఎల్క సోమయ్య, శ్రీలం శ్రీను పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల సంఘం మండల అధ్యక్షుడిగా యాదగిరి

నాగారం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందుల సంఘం మండల అధ్యక్షుడిగా చిత్తలూరి యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మండల కేంద్రంలో ఆ సంఘాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కప్పల శంకర్, ఉపాధ్యక్షుడిగా పోర్ల యాదగిరి, కోశాధికారిగా మంగదుడ్ల మహేష్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బుర్ర శంకర్, కోడవకంటి వెంకన్న, రామకృష్ణ, మల్లయ్య, నాతి మహేష్, కన్నెబోయిన యాదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యాలను అరికట్టడం విప్లవ పార్టీలకే సాధ్యం

నేరేడుచర్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): దౌర్జన్యాలను అరికట్టడం విప్లవ పార్టీలకే సాధ్యమని సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. గురువారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రకుల అహంకారానికి నిదర్శనంగా కారంచేడు ఘటన జరిగి నేటికి 40 సంవత్సరాలు అయిందన్నారు. కారంచేడులో దళితులపై జరిగిన దాడిలో ఏడుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారని అన్నారు. ఇటువంటి దాడులు దేశంలో అక్కడక్కడా జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇలాంటి దౌర్జన్యాలను అరికట్టాలంటే విప్లవ పార్టీలకే ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో వాన పల్లయ్య, సయ్యద్ హుస్సేన్, వాన కరుణాకర్, అంబటి భిక్షం,లక్ష్మి, ఫాతిమా, కృష్ణమ్మ, మరియమ్మ, సుమలత, శ్యామల పాల్గొన్నారు.

రహదారిలో కంపచెట్లు.. ప్రజలకు ఇక్కట్లు

● రాకపోకలకు తీవ్ర ఆటంకం ● తరచూ ప్రమాదాలు

మఠంపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని రోడ్లలో రెండు వైపులా కంపచెట్లు పెరిగి మూసు కువస్తున్నాయి. దీంతో సరైన దారిలేక ఈ రోడ్లపై రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని దొనబండతండా, భీల్యానాయక్‌తండా, యాతవాకిళ్ల, హనుమంతులగూడెం, అల్లీపురం, కొత్తతండా నుంచి జామ్లాతండా, తుమ్మలతండా నుంచి గుర్రంబోడుతండా, మంచ్యాతండా తదితర గ్రామాలకు వెళ్లాలంటే రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు దట్టంగా పెరిగి రోడ్డును మూసివేశాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. కంప చెట్లు తొలగించాలని స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా స్పందన లేదని స్థానికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పాత దొనబండతండా నుంచి భీల్యానాయక్‌తండాకు వెళ్లే రోడ్డులో కమ్ముకొచ్చిన కంపచెట్లు

కంపచెట్లు తొలగించాలి



రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరిగి రోడ్డు పైకి వచ్చినం దున ప్రయాణించా లంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దీంతో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల స్థాయి అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. అధికారులు సమస్యను గుర్తించి కంప చెట్లను తొలగించాలి.

● బానోతు నాగేశ్వరావునాయక్

శాశ్వత పరిష్కారం చూపాలి



ప్రమాదాల జరిగినప్పుడు అధికారులు హడావిడి చేసున్నారు. సమస్యను ముందుగా గుర్తించి పరిష్కా రానికి కృషి చేయడంలేదు. తండాలకు వెళ్లే దారుల్లో కంపచెట్లను తొలగించి సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.

● బానోతు బాబునాయక్

గ్రామీణ పాఠశాలల బలోపేతమే స్ట్రీట్ కాజ్ లక్ష్యం



తొండ గ్రామ ఉన్నత పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందజేస్తున్న వీబీఐటీ చైర్మన్, స్ట్రీట్‌కాజ్ సభ్యులు

తిరుమలగిరి రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పాఠశాలల బలోపేతమే స్ట్రీట్ కాజ్ లక్ష్యమని విజ్ఞాన భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీబీఐటీ) కళాశాల చైర్మన్ నెమురుగొమ్ముల గౌతమ్‌రావు అన్నారు. గురువారం మండలంలోని తొండ గ్రామంలోని ఉన్నత పాఠశాలకు రూ.2లక్షల విలువైన కంప్యూటర్, టేబుల్స్, సైన్స్ ల్యాబ్, సౌండ్ సిస్టం, కుర్చీలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పాఠశాల పూర్వ విద్యార్థిని కాకపోయినా గ్రామంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. హైదరాబాద్ డిప్యూటీ డీఈవో శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తొండ గ్రామస్థులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ఎంఈవో శాంతయ్య, ఆదర్శ పాఠశాల చైర్మన్ అనిత, స్ట్రీట్ కాజ్ డైరెక్టర్స్ పోతులయ్య, స్వరూప, ప్రెసిడెంట్ అక్షయ బాలాజీ, పూర్వ విద్యార్థులు సోమనారాయణ, వినోదరావు, ఓ.వెంకన్న, పుల్లయ్య, సామాజిక కార్యకర్త లక్ష్మయ్య, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సైదులు, వెంకట్, సైదులు, రాజు, మాజీ సర్పంచ్ శాతవాహన రావు, మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యశాఖల్లో మెరుగులు

(5వ పేజీ తరువాయి)

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. పాఠశాలకు గోడలపై అందంగా జంతువుల బొమ్మలు, ప్రపంచ పటాలు, సైన్స్ బొమ్మలు వేయించారు. దీంతో విద్యార్థులు నిరంతరం ఆ బొమ్మలను చూస్తూ కొంత జ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నారు.

సకాలంలో అందుతున్న వైద్యసేవలు

కలెక్టర్ తనిఖీలతో ఆరోగ్య కేంద్రాలకు వైద్యులు, సిబ్బంది సమయానికి వస్తున్నారు. దీంతో గతంలో 10 నుంచి 15 వరకు మాత్రమే ఓపీ ఉంటే ప్రస్తుతం 150 వరకు పెరిగింది. కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ తనిఖీల్లో భాగంగా ఔషధాలు ఉన్నాయా, లేవా అని పరిశీలిస్తున్నారు. లేనిచోట్ల ఔషధాలను వెంటనే సరఫరా చేయిస్తున్నారు. కోదాడలోని 30పడకల ఆసుపత్రిలో సీటీస్కాన్ ఏర్పాటు చేయించారు. తాజాగా గురువారం కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసి ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించి గైనకాలజిస్టు పద్మావతి లేకపోవడంతో ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దశరథను నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సాధారణ ప్రసవం అయిన రెడ్లకుంట గ్రామానికి చెందిన శిరీషతో ఆయన మాట్లాడి సేవల గురించి తెలుసుకున్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి

నాణ్యమైన విద్యతోనే దేశాభివృద్ధి జరుగుతుంది. విద్యార్థులకు చిన్నతనంలోనే దేశభక్తి, క్రమశిక్షణ అలవాటు చేస్తే మంచి పౌరులకు తయారవుతారు. నాణ్యమైన విద్యను అందిస్తే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయి. వైద్యం విషయానికి వస్తే పేదలే ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తారు. వారికి భరోసా కల్పించాలి. మంచి వైద్యాన్ని అందించే బాధ్యతలను వైద్యులు, సిబ్బంది తీసుకోవాలి.

● తేజస్‌నందలాల్ పవార్, కలెక్టర్

ఆసుపత్రి వ్యర్థాలతో అనర్థాలు

(5వ పేజీ తరువాయి)

వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ బోర్డు నుంచి 741 ఆస్పత్రులు అనుమతులు పొందాయి. అందులో కేవలం 302 ఆస్పత్రులు మాత్రమే మెడికల్ వ్యర్థాలను ఏజెన్సీకి అప్పగిస్తున్నాయి. మిగతా ఆస్పత్రులు నిబంధనలు పాటించకున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు. ఈవిషయమై ఏజెన్సీ నిర్వాహకులు బోర్డు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

అమలుకు నోచుకోని బార్ కోడింగ్ విధానం

ఆస్పత్రుల్లోని వ్యర్థాలను నిర్వీర్యం చేసే విషయంలో బార్‌కోడింగ్ విధానాన్ని అమలుచేయాలని ప్రభుత్వం 2016లో జీవో తీసుకవచ్చింది. కానీ నేటికీ ఈ విధానం అమలుకావడం లేదు. ఈ విధానం వలన ఆసుపత్రి వ్యర్థాలను సేకరించేందుకు రంగుల సంచులను అందిస్తారు. వాటికి ఒక బార్‌కోడ్‌ను కేటాయిస్తారు. సంబంధిత ఏజెన్సీ వారు బార్‌కోడ్‌ను సంచులపై ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వ్యర్థాలను సేకరించే సమయంలో ఆస్పత్రుల్లో స్కాన్ చేయాల్సి ఉంటుంది. అందుకోసం ప్రతి ఆస్పత్రిలో బార్‌కోడ్ స్కానర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనికి ఒక కామన్ సర్వర్ కూడా ఉండాలి. వ్యర్థాలను సేకరించే సమయం, సేకరించిన తర్వాత స్కాన్ చేయాల్సి ఉంటుంది. దీంతో వ్యర్థాల సేకరణ అంశాలను వెంటనే పరిశీలించే అవకాశం ఉంటుంది. దీనిని అమలుచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా అమలుకు నోచుకోవడం లేదు.

నిబంధనలు పాటించాల్సిందే

బయోమెడికల్ వ్యర్థాలను నిర్వీర్యం చేసే విషయంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు విధిగా నిబంధనలు పాటించాలి. ఈ మేరకు ఆదేశాలు జారీచేశాం. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారి వద్ద రిజిస్ట్రేటషన్ చేసుకోవాలి. వారి నిబంధనల ప్రకారం వ్యర్థాలను ఏజెన్సీకి అప్పగించాలి. ఎవరైనా నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ జయమనోరి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో సూర్యాపేట

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భానుపురి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట 1వ పట్టణంలోని 11కేవీ శ్రీరాంనగర్ ఫీడర్‌లో మరమ్మతులతో పాటు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్పనగర్, జీవీవీ ఫంక్షన్ హాల్, జాకీర్‌హుస్సేన్ నగర్, శ్రీరాంనగర్, బ్రాహ్మణ కల్యాణ మండపం, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, బాలాజీనగర్, దుర్గామాత సెంటర్, కుడకుడ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సమగ్ర వ్యవసాయ ప్రణాళికను రూపొందించాలి

నాగారం, జూలై 17(ఆంధ్రజ్యోతి) ఈ వానాకాలం సీజన్‌లో రైతులను ఆదుకోవడానికి సమగ్ర వ్యవసాయ ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఎరువుల కొరత లేకుండా, పంట రుణాల కోసం రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం పర్యవేక్షణ చేయాలన్నారు. ట్యాక్సీ, ట్రాక్టర్ ఉంటే ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులుగా ప్రకటించడాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, కమిటీ సభ్యులు పులుసు సత్యం, సీపీఎం మండల కార్యదర్శులు దేవరకొండ యాదగిరి, వజ్జె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలి

గరిడేపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కుక్క కాటుతో వచ్చే రేబిస్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి వి.నరేష్ అన్నారు. గురువారం మండలంలోని రేగులగడ్డ తండాలో రేబిస్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కుక్క కరిచిన పశువుల పాలను బాగా మరిగించి తాగితే ఎటువంటి ప్రమాదం ఉండదని అన్నారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. కుక్క, కోతి, పిల్లి వంటి జంతువులు కరిచినప్పుడు తప్పకుండా రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలని, పెంపుడు జంతువుల లాలాజలం కూడా శరీరంపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎన్.అంజయ్య, అశోక్, ఉపేందర్, అరుణ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

మద్దిరాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.సోమయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో నిర్వహించినన ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి ఆధారంగా కాకుండా 30మంది విద్యార్థులు ఉన్న ప్రతి పాఠశాలకు ముగ్గురు ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పల్లేటి అబినవ్, దేవులపల్లి రమేష్, వరికుప్పల గంగయ్య, దార బిక్షం పాల్గొన్నారు.

విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించేందుకు కృషిచేయాలి

కోదాడ టౌన్, కోదాడ రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులు ఆగస్టు 15వ తేదీ నాటికి కనీస సామర్థ్యాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ ఆదేశించారు. గురువారం కోదాడలోని జడ్పీహెచ్ఎస్‌ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల పఠన నైపుణ్యాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. గత సంవత్సరం నిర్వహించిన కార్యక్రమాలను ఈ విద్యా సంవత్సరం నిర్వహించే యాక్షన్ ప్లాన్‌ను పరిశీలించారు. బేస్ లైన్ టెస్ట్ ఫలితాలను సమీక్షించి విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపుదలకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. పాఠశాలలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న కంప్యూటర్ ల్యాబ్ పనుల పురోగతి పనులను, నూతనంగా నిర్మిస్తున్న గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. బాలికలకు ప్రత్యేకంగా టాయిలెట్ల నిర్మాణానికి రూ.7లక్షలు మంజూరు చేశారు. బాలుర టాయిలెట్స్ నిర్మాణానికి, పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదులను పూర్తి చేయడానికి ఇంజనీరింగ్ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేకంగా బడి తోటను పరిశీలించి, మొక్కల సంరక్షణకు మునిసిపల్ శాఖ సహకారాన్ని తీసుకోవాలని ఇన్‌చార్జి హెచ్ఎం మార్కండేయకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ వాజీద్‌అలీ, మునిసిపల్ కమిషనర్ రమాదేవి, ఎంఈవో సలీంషరీఫ్, ఉపాధ్యాయుడు జానకిరాములు పాల్గొన్నారు.



కోదాడలోని జడ్పీహెచ్ఎస్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదు

రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. గురువారం కోదాడలోని మేళ్లచెర్వు రోడ్డులో ఉన్న ఓ ఫర్టిలైజర్స్ షాపును కలెక్టర్ పరిశీలించారు. యూరియా, డీఏపీ ఇతర నిల్వలను పరిశీలించారు. యూరియా, డీఏపీ బస్తాలను ఎంతకు విక్రయిస్తున్నారని దుకాణ యజమానిని కలెక్టర్ అడిగారు. యూరియాను రూ.266 డీఏపీని రూ.1350కి విక్రయిస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం స్టాక్ రిజిస్టర్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వాజిద్ అలీ, ఏవో రజిని, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గోరింటాకు సంబరాలు

సూర్యాపేట అర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం సందర్భంగా వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీగీతా మందిరంలో గోరింటాకు సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోరింటాకును ఒకరి చేతులకు మరొకరు పెట్టుకునే కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. గోరింటాకు వేడుకల్లో పాల్గొన్న మహిళలకు లక్కీడ్రా తీసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వనితా వాసవి క్లబ్ అధ్యక్షురాలు శ్రీదేవి, భవాని, పద్మజ, సుధా, మాధురి, అనిత, సుధారాణి, పద్మ పాల్గొన్నారు.

గిరిజనుల హక్కులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

మఠంపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కులను పాలక ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు భూక్య పాండునాయక్, జిల్లా అధ్యక్షుడు మాలోతు బాలునాయక్‌లు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 3146 గిరిజన తండాలను పంచాయతీలుగా గుర్తించిప ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. తండాల్లో నేటికీ విద్య, వైద్యం, రవాణా సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శంభయ్యనాయక్, బాలకృష్ణ, నీలావతిబాయ్, చిన్నబాలు, రంగానాయక్, బాల్‌సింగ్‌నాయక్, శ్రీనునాయక్, రాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినీ విద్యార్థులు ఒత్తిడిని జయించాలి

మేళ్లచెర్వు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినీ విద్యార్థులు ఒత్తిడిని జయించి భావోద్వేగాలను అధికమించి ధైర్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని మోటివేషన్ స్పీకర్ పవన్ అన్నారు. గురువారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కెరీర్, వ్యక్తిత్వ వికాసంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిత్వ వికాస నిపుణురాలు ఉదయశ్రీ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు లక్ష్య సాధనకు కృషిచేసే సమయంలో ఏర్పడే సమస్యలను ఎలా అధికమించాలి అనే అంశంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటరెడ్డి, ఎస్‌వో హరిత, ఉపాధ్యాయులు మహేశ్వరి, విజయ, ఉష, లక్ష్మీరాజ్యం, సైదమ్మ, సుజాత, వసంత పాల్గొన్నారు.

'మాలలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్'

సూర్యాపేట అర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మాలలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎం.భాస్కర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాలలకు అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాలలకు తీవ్ర విఘాతం కలిగించేలా 22రోస్టర్ పాయింట్ కేటాయించడం దారుణమన్నారు. ఎలాంటి ఉద్యోగాలకైనా 22మంది తర్వాత వచ్చే రిజర్వేషన్ దారుణమన్నారు. రోస్టర్ విధానాన్ని వెంటనే రద్దుచేసి మాలలను ఆదుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంమాలలను విస్మరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలకిషన్, నర్సింహా, రాహుల్, వేణుబలరాం, సైదులు, తాళ్లపల్లి రవి, పున్నమ్మ, జాకబ్, నాగయ్య, మురళి, పిట్టల బాగ్యమ్మ, వేణు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

మేళ్లచెర్వు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పరమేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామానికి చెందిన గుగులోతు శంకర్ ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా, మేళ్లచెర్వు మండలంలో గురువారం పట్టుకుని తహసీల్దార్ రాజేందర్‌నాథ్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసి రూ.50వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పరమేష్ మాట్లాడుతూ ఒకసారి పట్టుబడిన వాహనం మరోసారి పట్టుబడితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నేడు మంత్రి ఉత్తమ్, గుత్తా, జానారెడ్డిల పర్యటన

హుజూర్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మంత్రి ఉత్తమ్, శాసనమండలి స్పీకర్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ సీఎల్పీ నేత జానారెడ్డిలు శుక్రవారం హుజూర్‌నగర్‌కు రానున్నట్లు మంత్రి పీఆర్వో వెంకటరెడ్డి తెలిపారు పట్టణంలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ మైనార్టీ సెల్ నేత ఎండీ నిజాముద్దీన్ సంతాపసభలో పాల్గొంటారని, ఈ సంతాప సభకు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్‌లు హాజరవుతారని తెలిపారు.

ఫొటోగ్రాఫర్ల సంఘం పట్టణ అధ్యక్షుడిగా శ్రీకాంత్

హుజూర్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం ఫొటోగ్రాఫర్ల సంఘ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోవిందాపురానికి చెందిన ఎం.శ్రీకాంత్ ఎన్నికయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లకు ప్రభుత్వం ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఎంతో మంది నిరుపేదలు ఇదే వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నారన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు చేపూరి లక్ష్మణ్, మహేష్, లాలయ్య, రాజు, వెంకన్న, శ్రీను, రాజు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

నూతనకల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్‌రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులుఇరుగు సోమయ్య, ఉప్పు నాగయ్య, దయాకర్, పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధిపై సమావేశం

కోదాడ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపుగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గురువారం సంఘ చైర్మన్ నంబూరి సూర్యం అధ్యక్షతన కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అభివృద్ధికి సంబంధించిన విషయాలపై చర్చించారు. s

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నూతనకల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ అధికారి చరణ్‌నాయక్ అన్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులపై గురువారం మండలంలోని ఎర్రపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ముత్తయ్య, సుమంజలి, ఆనంద్ పాల్గొన్నారు.

వైభవంగా తీజ్ వేడుకలు

మఠంపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచ్యాతండా, జమ్లాతండా, దొనబండతండాలలో గురువారం తీజ్ వేడుకలను గిరిజనులు వైభవంగా నిర్వహించారు. తీజ్ బుట్టలను మహిళలు, యువతులు ఎత్తుకొని ఊరేగింపుగా సంప్రదాయ పద్ధతిలో నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ తండా సమీపంలో బావులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు,పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందుల పంపిణీ నేడు

కోదాడ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో శుక్రవారం గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రారంభిస్తారని వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య, పశు సంవర్ధక అధికారితో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని, ఈ అవకాశాన్ని గొర్రెల, మేకల పెంపకదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి విరాళం

తిరుమలగిరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కోసం మునిసిపల్ కేంద్రానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకుడు కృష్ణమాచారిలు 5వేల చొప్పున విరాళాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు కళాశాల ప్రిన్సిపాల్ బచ్చలకూరి మృత్యుంజయ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట లెక్చరర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ మట్టపల్లి క్షేత్రంలో గురువారం శ్రీలక్ష్మీ నృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్ పాల్గొన్నారు.







